

# వేలంవెర్రి

కళింగరాజు దండెత్తి వస్తున్నాడని విజయ నగరంలో పుకారు పుట్టింది. ప్రజలు ఆహార పదార్థాలు నిల్వ చేసుకోసాగారు. ఇదే సమయమని వ్యాపారులు ధరలు బాగా పెంచేశారు.

పరిస్థితి గమనించిన మంత్రి, "మహారాజా! ప్రజలు యుద్ధం వస్తున్నదని భయపడి ఆహార పదార్థాలు వేలంవెర్రిగా కొనుక్కుని పోతున్నారు. వ్యాపారులు ధరలు బాగా పెంచారు," అని విన్నవించాడు రాజుతో.

రాజు నవ్వుకుని ప్రభుత్వ గిడ్డంగులలో నిల్వవున్న ఆహార పదార్థాలన్నీ విడుదల చెయ్యమనీ, సరసమైన ధరలకు ప్రజలకు విక్రయించమనీ ఆజ్ఞాపించాడు. వెంటనే సత్వర చర్యలు తీసుకున్నందువల్ల పరిస్థితి చక్కబడింది.

"మంత్రీ! ఇంతకుముందు నువ్వు వేలం వెర్రి అన్నావు, ఆ మాటకు అర్థం ఏమిటి?" అని ఒక రోజు రాజు, మంత్రిని అడిగాడు.

"మహాప్రభూ! వేలంవెర్రిని మాటలతో నిర్వచించి చెప్పలేం. సమయం వచ్చినప్పుడు తమకు ప్రత్యక్షంగా చూపిస్తాను," అని విన్నవించాడు మంత్రి.

కొన్ని రోజులు గడిచాక ఒకనాడు రాజూ, మంత్రీ రథంలో వాహ్యాళికి బయల్దేరారు.

నగరం మధ్యలో వున్న వుద్యానవనంలో ఒక చెట్టుకింద ఒక ముని ధ్యాననిమగ్నుడై వుండడం చూసి మంత్రి రథం ఆపించి, ఆ మునికి సాష్టాంగ ప్రమాణం చేశాడు. అంతేగాక తన మెడలోని ముత్యాలహారం ఆయనకు కానుకగా సమర్పించుకున్నాడు.

మంత్రిని చూసి రాజు గూడా రథం దిగి, ఆ మునికి సాష్టాంగపడి, విలువైన ఒక రత్నాల హారం కానుకగా ఇచ్చాడు.

ముని రాజునూ, మంత్రినీ దీవించాడు. రాజ పరివారం మునికి సాష్టాంగపడి తమ తాహతు

కొద్దీ కానుకలు చెల్లించుకున్నారు.

నగరంలోకి ఎవరో మహాముని వచ్చారని ఆ మహానుభావుడు ఎంతో మహిమగలవాడనీ, ముట్టుకుంటే చాలు రోగాలు నయమైపోతాయనీ పుకారు పుట్టింది.

మర్నాటికల్లా ప్రజలు తండోపతండాలుగా ఉద్యానవనానికివచ్చి మునిని దర్శించసాగారు. వారిని అదుపులో పెట్టడానికి రాజభటులు వెళ్ళాల్సి వచ్చింది. ఆ ప్రాంతమంతా తిరునాళ్ళగా మారిపోయింది.

మంత్రి, రాజును పిల్చుకొని వచ్చి చూపించాడు ఆ కోలాహలమంతా.

"మంత్రీ! ఈ ముని ఎవరో గాని గొప్ప మహిమ గలవాడిలా వున్నాడే," అన్నాడు రాజు, ఆ కోలాహలాన్ని చూస్తూ.

"అదంతా ప్రజల వేలంవెర్రి ప్రభూ!" అన్నాడు మంత్రి నవ్వుతూ.

రాజు మంత్రి మాటలకు ఆశ్చర్య పోతూ, "ఆ మునికి మహిమలు లేవా?" అని ప్రశ్నించాడు.

"గుర్రాలు తోమేవాడికి మహిమలు ఎలా వుంటాయి ప్రభూ?" అని ఎదురు ప్రశ్న వేశాడు మంత్రి.

"ఏమిటీ ఆ ముని గుర్రాలు తోమేవాడా?"

"అవును ప్రభూ! మన అశ్వశాలలో గుర్రాలు తోమే నారిగాడు వాడు. వేలంవెర్రి ఎలా వుంటుందో తమకు ప్రత్యక్షంగా చూపడానికి నేనే వాడికి మునివేషంవేసి అక్కడ కూర్చోబెట్టాను," అన్నాడు మంత్రి.

రాజుకు వేలంవెర్రి ఎలా వుంటుందో అప్పటికి అర్థమైంది.

